క్లుప్తంగా

త్యాగరాజస్వామి విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు



నూతనంగా నిర్మించిన త్యాగరాజస్వామి ఆలయం

కొలిమిగుండ్ల: స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన త్యాగరాజ స్వామి ఆలయంలో ఈనెల 28 నుంచి 30 వరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. వేదపండితుడు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. చివరి రోజు త్యాగరాజస్వామితో పాటు హనుమద్ సమేత సీతారామ, లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ట జరుగుతుందన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

26 నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు

కోవెలకుంట్ల: పట్టణంలో జీర్ణోద్ధరణ గావించిన సోమలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో గణపతి, పార్వతి, నంది, నాగ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఆర్‌ఎం

బనగానపల్లె రూరల్: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పసుపల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులకు బుధవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. బయోస్టాండ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో కంపెనీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్, హెచ్‌ఎం రవీంద్ర చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున నగదు పంపిణీ చేశారు.సర్పంచ్ మోహన్‌బాబు, పవన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



బుగ్గానిపల్లెలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బుగ్గానిపల్లె గ్రామంలో పంట నమోదును పరిశీలించారు. పంట నమోదు వల్ల నష్టపరిహారం, బీమా, సున్నా వడ్డీకి పంట రుణాలు, మద్దతు ధర వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌ను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్ రవి తేజ, ఏఈఓ మహ్మద్ పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మేనేజర్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామానికి చెందిన దేవమ్మ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబానికి బ్యాంకు అధికారులు బుధవారం బీమా నగదు అందజేశారు. దేవమ్మ ఆరు నెలల క్రితం శనగ కోత, నూర్పిడి పనులకెళ్లి ప్రమాదవశాత్తు శనగ కోత యంత్రంలో పడి మృత్యువాత పడింది. మృతురాలు గోస్పాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పాలసీదారురాలు కావడంతో ప్రమాద బీమా వర్తించింది. ఈ మేరకు బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ మేనేజర్ సాహితి, బ్యాంకు సిబ్బంది గ్రామానికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల బీమా చెక్కును అందజేశారు. బ్యాంకు కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యాపదిన్నెలో వీధి దీపాల ఏర్పాటుకు వినతి



ఈఓఆర్డీకి వినతిపత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

డోన్ రూరల్: మండల పరిధిలోని యాపదిన్నె గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు విజయ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ జయరాంకు వినతి పత్రం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో రోడ్లు నీటి కుంటలను తలపిస్తున్నాయని తెలిపారు. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, దివాకర్ తదితరులు ఉన్నారు.

జీవాలకు నీలినాలుక ముప్పు

- వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వచ్చే అవకాశం
- టీకాతో వ్యాధి నివారణ
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



సంజామల: నీలి నాలుక.. దీనినే బ్లూటంగ్, మూతివాపు, నోటి పుండ్ల వ్యాధి, పూతరోగం అంటారు. దోమలు ఉధృతంగా ఉండే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎక్కువగా ఉంటుంది. ఎక్కువగా గొర్రెల్లో సోకుతుంది. మేకలకు అరుదుగా వస్తుంది. వ్యాధి సోకే జీవాల్లో కనీసం 10 శాతం మరణిస్తారు. సకాలంలో నీలి నాలుక వ్యాధి గుర్తించకపోతే మృత్యువాత పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వ్యాధికి గురైన గొర్రెలను గుర్తించి మంద నుంచి వేరు చేయాల్సిన అవసరం ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వేంటనే పశువైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.

నీలి నాలుక వ్యాధి వ్యాప్తి ఇలా..

గొర్రెలు, మేకలకు నీలినాలుక వ్యాధి వైరస్ ద్వారా సోకుతుంది. క్యూలికాయిడిస్ దోమ కాటు కారణంనే ఈ వైరస్ వ్యాప్తి చెందుతుంది. మందలో ఒక గొర్రెకు వ్యాధి వస్తే మిగితా జీవాలకు కూడా వచ్చే అవకాశం ఉంది. వ్యాధికి గురైన పొట్టేలు వీర్యం ద్వారా కూడా ఈ వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాపించే ప్రమాదం ఉంది.

వ్యాధి లక్షణాలు

- నీలి నాలుక వ్యాధికి గురైన జీవాలకు తీవ్రమైన జ్వరం వస్తుంది. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం నాలుగైదు రోజుల వరకు ఉంటుంది.
- జ్వరం వచ్చిన 48 గంటల తర్వాత నోటి నుంచి చొంగ కారడం, నోరు ఎర్రగా మారడం, పెదవులు, చిగుళ్లు, నాలుక వాచిపోవడం, పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలి రంగుకు మారడం.
- నోటి నుంచి నురగతో కూడిన చొంగ, కళ్లు, ముక్కులు వాచి స్రవాలు కారుతాయి.
- దుర్వాసన వస్తుంది. చీము పట్టి నడవలేక కుంటుతాయి.
- వ్యాధి వచ్చిన గొర్రెలు, మేకలకు గర్భస్రావం కూడా కావచ్చు.
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మేత తినలేక జీవాలు నీరసించి మృత్యువాత పడుతాయి.

వ్యాధి నివారణ చర్యలు

గొర్రెలు, మేకలు నీలి నాలుక వ్యాధి బారిన పడకుండా క్రమం తప్పకుండా బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాలి. గొర్రెల మందలను నిలిపే పాకలో దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలి. జబ్బు చేసిన గొర్రెలు, మేకలను మంద నుంచి వేరు చేయాలి. పశువైద్యున్ని సంప్రదించి సలహా మేరకు చికిత్స అందించాలి.

జాగ్రతలు పాటించాలి



దోమకాటు కారణంగా నీలి నాలుక వ్యాధి వస్తుంది. వర్ష కాలంలో గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధి బారిన పడకుండా ముందుగానే వ్యాక్సిన్‌లు వేయించడం ఉత్తమం. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. ఇది అంటు వ్యాధి. ఒక గొర్రెకు వస్తే దాని చుట్టుపక్కల ఉన్న జీవాలకు సంక్రమించే ప్రమాదం ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యులను సంప్రదించి సలహాలు, సూచనల మేరకు చికిత్స అందించాలి.

–డాక్టర్ మోహన్ రావు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, సంజామల

రేపు ఉపాధి పనులపై గ్రామ సభలు

కొలిమిగుండ్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరంలో చేపట్టనున్న పనుల ఆమోదం కోసం శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామ సభలకు వివిధ శాఖలకు చెందిన అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సర్పంచ్‌లు, రైతులు, ఉపాధి కూలీలు గ్రామ సభలో పాల్గొంటారని చెప్పారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం శింగవరానికి చెందిన మునగాల పెద్ద హుసేనిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం దాడికి పాల్పడినట్లు ఏఎస్‌ఐ గోవిందునాయక్ తెలిపారు. పెద్ద హుసేని, ఫక్కీర, వెంకట హుసేనీల మధ్య పొలం విషయంలో వివాదం ఉండేది. బైక్‌పై పెద్ద హుసేని కొలిమిగుండ్ల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలోని బెలుం సమీపంలో ఉన్న గ్యాస్ గోడౌన్ వద్ద అడ్డగించి ఇద్దరు దాడికి పాల్పడి గాయపరిచారు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు



కోవెలకుంట్లలో విత్తన స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏఓ

కోవెలకుంట్ల: రైతులకు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి నిరంజన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన స్టాక్, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయా షాపుల్లోని మొక్కజొన్న, కంది విత్తన శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. డీలర్లు విత్తనాల వివరాలను స్టాక్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. విత్తనాలు పొందిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. పంటకాలం పూర్తి అయ్యేంత వరకు విత్తన బిల్లులను రైతులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. విత్తన డీలర్లు స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, విత్తన చట్ట నిబంధనలను పాటించాలని సూచించారు. లేబుల్‌లేని, లూజు సీడ్‌ను రైతులకు విక్రయించవద్దని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ పోలీసులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఈడిగ శ్రీరాములు, బోయ నాయుడుతో పాటు డోన్‌కు చెందిన మాల స్వామి, మద్దిలేటి పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆటో బోల్తా.. కూలీ మృతి



మృతుడు నరసింహులు

గుత్తి రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన తమ్మన్నగారి నరసింహులు (37) అనంతపురంలోని టమాట మండీలో కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అదే గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలతో కలిసి బుధవారం ఉదయం ఆటోలో అనంతపురానికి బయలుదేరాడు. గుత్తి మండలం కొత్తపేట శివారులోకి చేరుకోగానే బైపాస్ బ్రిడ్జిపై డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై ఎస్‌ఐ నబీరసూల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కీర్తి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

బుగ్గన కృషితోనే తాగునీటి సమస్యకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేసిన వ్యక్తి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, పులివెందుల, డోన్ నియోజకవర్గంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వాటర్ గ్రిడ్ పథకాల రూపకల్పన చేశారని తెలిపారు. తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్న డోన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ. 351 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం మంజూరు చేశారన్నారు. రెండున్నరేళ్లలోనే పనులు పూర్తి చేసి మొదటి విడతగా బేతంచెర్ల పట్టణానికి ఈ ఏడాది మార్చిలో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరాను ప్రారంభించారని చెప్పారు. వచ్చే రెండేళ్లలో అమృత్ 2.0 పథకం ద్వారా బేతంచెర్ల పట్టణంలో ఇంటింటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇస్తామని తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని బేతంచెర్లలో రెండు సంపులు, 8 ఓవర్ హెడ్ ట్యాంకులకు నింపి సరఫరా చేస్తామన్నారు. పార్టీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలీ, లక్ష్మి రెడ్డి, రామచంద్రుడు, గూని నాగరాజు, దస్తగిరి, ఇబ్రహీం, తిరుమలేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, ఎద్దులన్న ఉన్నారు.

బనగానపల్లెలో డ్రైనేజీల అభివృద్ధికి కృషి



డ్రైనేజీ కాల్వను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: పట్టణంలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిచేస్తామని రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లెలోని పెట్రోల్ బంక్ నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు పెండింగ్‌లో ఉన్న ఫోర్‌లైన్ రోడ్డుతో పాటు డ్రైనేజీ వ్యవస్థను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను రూ.2.40 కోట్లతో రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. పలు చోట్ల సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, పీఆర్‌డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ మహేష్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత



కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

డోన్ రూరల్: మండల పరిధిలోని గోసానిపల్లె గ్రామంలో బుధవారం బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో 15 ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్ బేగంకు సమాచారం అందడంతో పోలీసుల సహకారంతో పెళ్లిని నిలుపుదల చేశారు. బాలికకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని.. ఆలోపు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరం అని.. కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని బాలిక తల్లిదండ్రులు, వరుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభరాణి, పోలీసులు ఉన్నారు.

శానిటేషన్ పనులపై అశ్రద్ధ వహిస్తే చర్యలు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

డోన్ టౌన్: పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

- ఆటో సీజ్.. ఇద్దరి అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్

డోన్ టౌన్: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం సాక్షి పత్రికలో 'రేషన్ దందాకు పచ్చ జెండా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఇందులో భాగంగా రేషన్ బియ్యం వ్యాపార కలాపాలపై నిఘా ఉంచారు. బుధవారం అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి అందులో ఉన్న 360 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన మనోహర్, శ్రీకాంత్ ఆటోలో బియ్యాన్ని విక్రయించేందుకు కర్నూలుకు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి జాతీయ రహదారిపై కాపుకాసి ఆటోను సీజ్ చేశారు. బియ్యం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు అనే విషయంపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బియ్యం, ఆటోను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బలిజ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న బలిజలు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో బలిజ సంఘం పాణ్యం మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండజూటూరు గ్రామానికి చెందిన సిద్దం గంగనారాయణ, ఉపాధ్యక్షుడిగా గోనవరం గ్రామానికి చెందిన ఉప్పు విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పాణ్యం గ్రామానికి చెందిన పగిడి బాలకృష్ణుడు, జాయింట్ సెక్రటరీగా భూపన్‌పాడు గ్రామానికి చెందిన బండి మనోహర్, ట్రెజరర్‌గా మాదాసు కృష్ణ మోహన్ సహా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గంగ నారాయణ మాట్లాడుతూ.. మండలంలో కార్తీక వన భోజనం, శ్రీకృష్ణదేవరాయల జయంతిని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.

500 లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా డ్రమ్మును ధ్వంసం చేస్తున్న పోలీసులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామ సమీపంలో నాటుసారా తయారీకి ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ డి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేశామన్నారు. సారా తయారు చేస్తున్న మీనిగ పాండురంగడును అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే



నంద్యాల క్రాస్ రోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ అశోక్

బేతంచెర్ల: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపదల చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ పి.అశోక్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం బేతంచెర్ల పోలీసులు, నంద్యాల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులతో కలిసి నంద్యాల క్రాస్ నుంచి రైల్వేస్టేషన్ వరకు ట్రాఫిక్‌ను పరిశీలించారు. రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బేతంచెర్ల నుంచి కర్నూలు, నంద్యాలకు వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్‌లు సంజీవనగర్, హనుమాన్ నగర్, రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారా బేతంచెర్ల టౌన్ దాటాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు విధిస్తామన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ



బనగానపల్లెలో రాస్తారోకో చేస్తున్న మాలమహానాడు నాయకులు



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు,



అవుకులో ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

బనగానపల్లె రూరల్: రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ చేస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు అన్నారు. బుధవారం దేశ వ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా బనగానపల్లె పెట్రోల్ బంక్ సర్కిల్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. మాలమహానాడు నాయకులు పుల్లయ్య, చిన్నరాయుడు, జేమ్స్, పుల్లయ్య, మద్దిలేటి, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పునః సమీక్షించాలి

బేతంచెర్ల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని మాల మహానాడు జేఏసీ నాయకులు బొల్లి మద్దిలేటి, మునిస్వామి, రామసుబ్బయ్య, సుధాకర్ కోరారు. బుధవారం బేతంచెర్లలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయడం భావ్యం కాదన్నారు. మాల మహానాడు నాయకులు దేవరాజు, దాసరి పెరుమాల్, రమేష్, చెన్న కేశవులు, హరి, జార్జి, సాల్మాన్ రాజు, సత్యరాజు పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకునేందుకు ఉద్యమిస్తాం

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కోవెలకుంట్లలో అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబడి పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘం నాయకులు బద్రి, రవి, వెంకట్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసనలు

డోన్ టౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో డోన్‌లో బంద్ పాటించారు. పట్టణ సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కురిమెట్ల నారాయణ, మండల అధ్యక్షుడు సత్తిరాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు నాగేంద్ర, జిల్లా కార్యదర్శి ఓబయ్య, నాయకులు జాన్సన్, మంగమూరి గోపాల్, రమణ, సుధాకర్ తదితరులు ఉన్నారు.

అవుకులో భారత్ బంద్ ప్రశాంతం

అవుకు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన భారత్ బంద్ అవుకు మండలంలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహం నుంచి మండపం వీధి, సెంటర్, మార్కెట్, బస్టాండ్ ఏరియాల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం, రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ.. రాజకీయ స్వలాభం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ చేయడం అన్యాయమని అన్నారు. వారి రాజకీయ ఎత్తుగడలతో అన్నదమ్ముల్లా ఉన్న ఎస్సీలను విభజించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు పిల్లి జయచంద్ర, బెల్లం సుబ్బయ్య, కటారి ఆదాం, ఆవుల వినయ్, పేరి భాస్కర్, కొండయ్య, చిన్న, మహేంద్ర,శేఖర్, రాజవర్ధన్, కంబగిరి పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించడం సంస్కారం



వృద్ధులను సత్కరిస్తున్న జాన్

డోన్ టౌన్: సమాజంలో వృద్ధులను గౌరవించడం.. వారిపై ఆదరణ చూపడం మన సంప్రదాయం అని ఆదరణ వృద్ధాశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శాలువాలు కప్పి సత్కరించారు. కేక్ కట్ చేయించి సంబరాలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోలేని ఎందరికో ఇలాంటి కార్యక్రమాలు సాంత్వన ఇస్తుందని తెలిపారు.